# స్వప్న

**-కానేటి వివేకానంద**

**మా ఆఫీసులో స్టాఫంతా మగవాళ్లే! నలుగురివీ నాలుగురకాల మనస్తత్వాలు. అందరూ హీరోలే. కొందరు తెలుగు హీరోలైతే మరికొందరు హిందీ హీరోలు.**

**మాలో అందరికన్నా సీనియర్ పేరు వామనరావు. ఆకారంలో వామనావతారంలా కాకపోయినా, లక్షణాలు మాత్రం ఆ వామనుడికే మాత్రం తీసిపోవు.**

ఇక రెండోవ్యక్తి విషయానికొస్తే పేరు కృష్ణ మూర్తి- కృష్ణుడిలా శృంగార పురుషుడు కాకపోయినప్పటికీ ఆకారంలో మాత్రం సరిగ్గా ఆ నీల మేఘశ్యాముడికే మాత్రం తీసిపోడు.

మూడో వ్యక్తి రఘురాం ఉదార గుణంలో ధర్మరాజంతటి ఉదారత లేకున్నప్పటికీ జూదవ్యసనంలో ధర్మరాజుకే మాత్రం తీసిపోడు.

ఇక నా విషయానికి వస్తే. పుస్తకాల పురుగును. ఇలా నలుగురం నాలుగు కోణాలం.

వినాయక రావుగారు స్టెనోగా రిటైరైనప్పట్నుంచీ, ఆ సీటు ఇంతవరకూ భర్తీకాలేదు. స్టెనో గ్రాఫర్ కోసం ఎడ్వర్టయిజ్‌మెంట్ ఇవ్వడం, అటుపై ఇంటర్వ్యూ కూడా కండక్ట్ చేసి క్యాండిడేట్‌ని సెలెక్ట్ చేయడమూ జరిగింది.

అయితే కొత్త స్టెనోగ్రాఫర్ డ్యూటీకి రిపోర్టు చేయడమే, ఇక తరువాయి. కొత్తగా రాబోయే స్టెనో గ్రాఫర్ 'లేడి' అని తెల్సినప్పట్నుంచీ. మాలో ఏ ఒక్కరికి పనిమీదంతగా ధ్యాసలేదు. ఇది కేవలం స్టాఫ్‌కే పరిమితమనుకుంటే పప్పులో కాలేసినట్లే, బాస్‌కి కూడా అదే ధ్యాస.

రఘురాంకి తప్ప, అందరికీ పెళ్ళయ్యింది. రఘురాం ఆశించినా, ఊహాలోకంలో విహరించినా అర్థం- పరమార్థం ఉంది. అతనికంటే ఎక్కువగా పెళ్ళైన వాళ్ళే ఆమెరాక కోసం ఎదురు చూస్తున్నారు.

ఆరోజు ఉదయాన్నే....

"మనందరికీ ఓ గుడ్ న్యూస్ బ్రదర్స్" అంటూ ఏదో చెప్పడం ఆరంభించాడు వామనరావు.

అంతలోనే కృష్ణమూర్తి అందుకొని ఇక ఆలస్యం దేనికీ. అదేవిటో తొందరగా చెప్పుగురూ!" అంటూ హడావుడిచేశాడు.

'రేపు మన ఆఫీసుకి కొత్త స్టెనోగ్రాఫర్ వస్తుందోచ్" అన్జెప్పి బాత్‌రూం వైపుకు జారుకున్నాడు.

"ఇంతకీ ఆమెసీటు ఎక్కడ ఏర్పాటుచేస్తే బాగుంటుంది?" రఘురాం ప్రపోజల్ లేవనెత్తాడు.

"అవును గురూ! మాకిలాంటి ఆలోచన రానేలేదే?" కొద్దిగా ఆశ్చర్యాన్ని కనబరుస్తూ మూకుమ్మడిగా అందరూ అందుకున్నారు.

"సరే! బాస్‌నే అడిగితే పోలేదా?" అంటూ రఘురాం ముందుకొచ్చి ధైర్యంగా బాస్ ఛాంబర్‌లోకి వెళ్ళాడు.

"గుడ్ మార్నింగ్ సర్!"

"గుడ్ మార్నింగ్ రఘురాం. వాటీజ్ ద మేటర్ ఎనీ ప్రాబ్లమ్" చిర్నవ్వుతో పలుకరించాడు బాస్.

"అబ్బే! అదేంలేద్సార్. రేపు మన ఆఫీసుకి కొత్తస్టెనోగ్రాఫర్ వస్తుందికదా! ఆమెకు సీటెక్కడ అరేంజ్ చేస్తే బాగుంటుందా అని ఆలోచిస్తున్నాం." తటపటాయిస్తూ జవాబుకోసం బాస్ ముఖంలోకి చూశాడు రఘురాం.

"వ్వాట్ రఘురాం! ఏమిటంత స్పెషల్ ఇంట్రెస్ట్? అయినా, ఆమె వచ్చిన తర్వాత ఆలోచించుకోవచ్చులే" అంటూ సర్దిచెప్పి పంపేశాడు.

ఆ మరుసటి రోజు ఉదయాన్నే... ఎప్పుడూ తలకు తైల సంస్కారంగానీ, తనేసుకొనే డ్రెస్సుమీద శ్రద్ధలేకుండా జీవితంపై ఎలాంటి ఆశలేని వాడిలా కన్పించే వామనరావు, ఆవేళ నున్నగా గడ్డం గీసుకున్నాడు. మీసాలు ట్రిమ్ చేసుకున్నాడు. ప్యాంట్ బ్యాక్ పాకెట్‌లో దువ్వెన పెట్టుకుని టింగు రంగడి-లా తయారయ్యాడు.

కృష్ణమూర్తి పౌడరు కోటింగ్‌తో ముఖాన్ని కాస్త తెల్ల బర్చుకొని బ్లాక్ ప్యాంటుపై వైట్ షర్టు టక్‌చేసి పెళ్ళి చూపుల కొచ్చిన వరునిలా వచ్చాడు.

ఇక రఘురాం గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఎప్పుడూ చార్మినార్ సిగరెట్లు కాల్చే ఇతగాడు విల్స్ సిగరెట్ పాకెట్ షర్ట్‌పై జేబులో పెట్టుకొని రాజేష్‌ఖన్నా గెటప్‌లో వచ్చాడు.

నా విషయానికొస్తే నాలో కూడా ఏదో కొత్త ఉత్సాహం చోటుచేసుకుంది. అందుక్కారణం ఆఫీసులో దాదాపు ఆరేడు సంవత్సరాలనుండి చూసిన ముఖాన్నే చూసుకోవడంతో విసుగెత్తిపోయిన మేము, ప్రతి చిన్నవిషయాన్నీ పేద్ద సమస్యగా సృష్టించుకో-వడం, తద్వారా ఎడమొఖం, పెడమొఖంగా ఉండటం. కనీసం మా మధ్య ఓ లింగ భేదం మార్పైనా ఉంటే. కాస్త సమస్యలు తగ్గి ఆఫీసు కార్యకలాపాల మీద శ్రద్ధ పెరుగుతుందనే నమ్మకం.

ఇక మా బాస్‌లో కూడా చెప్పరానంత మార్పు. ఆవేళ ఫ్రెష్‌గా షేవ్ చేసుకున్నాడు. తెల్ల వెంట్రుకలకు నల్లరంగు పూసుకొని హిందీ హీరో రాజ్‌కపూర్ గెటప్‌లో వచ్చాడు. టోటల్‌గా అందర్లోనూ ప్రత్యేకమైన మార్పులే కన్పిస్తున్నాయి. చివరకు ఎదురుచూసిన అవకాశం రానేవచ్చింది.

"ఎక్స్‌క్యూజ్‌మీ... అయాం స్వప్న. కొత్త స్టెనో గ్రాఫర్‌ని. జాయినింగ్ రిపోర్టు ఎక్కడ ఇవ్వమంటారు?" అన్జెప్పి సమాధానం కోసం ఎదురు చూడసాగింది.


ఆ అమ్మాయి పర్సనాలిటీకీ, వాక్చాతుర్యానికీ ఖంగుతిన్న వామనరావు ఆమెకేసే గుడ్లప్పగించి చూస్తూండి పోయాడు తప్ప కనీసం ఆమెకు సమాధానం చెప్పాలన్న ఇంగితం కూడా మరచి పోయాడు.

వెంటనే రఘురాం కల్పించుకున్నాడు. "మేడమ్! ఆ ఛాంబర్‌లో బాస్ ఉంటారు వెళ్ళి జాయినింగ్ రిపోర్టిచ్చిరండి. ఈ లోగా మీసీటు రెడీ చేస్తాం." అంటూ బాస్ ఛాంబర్ కేసి చెయ్యి చూపించాడు.

సింపుల్‌గా ముస్తాబైన స్వప్న పూతకొచ్చిన రెమ్మలా ఉంది. ఆమెది అందమైన కోలముఖం. ఆకర్షణీయమైన ముక్కు, అతిసన్నని నడుము, వైట్ బ్లూ కలర్ జాకెట్ గులాబీ పూవు రంగు శారీ ధరించి, జడలో విరజాజులు తురుముకొని తళా తళా మెరిసి పోతోంది.

ఆమె జాయినింగ్ రిపోర్టిచ్చి బాస్ ఛాంబర్ బయట కొచ్చింది. ఆమె వెనుకనే బాసూ వచ్చాడు.

అప్పటికే ఆమె సీటు గురించి సీరియస్‌గా చర్చించు కుంటున్నారు స్టాఫంతా. అందరి ఆలోచనలనూ భంగపరుస్తూ ఆమె సీటును బాస్ తన ఛాంబర్‌కి దగ్గర్లోనే ఏర్పాటుచేసి లోపలికి వెళ్ళి పోయాడు.




స్వప్న- స్వప్న సుందరేకాదు. మృదు మధుర భాషిణి. అన్నిటినీ మించి కలుపుగోలుతనం ఆమెలోని ప్రత్యేకత. ఈ లక్షణాలన్నీ స్టాఫందరికీ నచ్చినా, అందర్తో ఒకేలా మెలగడం ఎవరికీ ఇష్టం ఉండేదికాదు. సరికదా! ఏకాంత సమయం చూసుకొని ఒకరిమీద మరొకరు చాడీలు చెప్పేరామెకు.

ఇలా అతి తక్కువ వ్యవధిలోనే స్టాఫ్ మెంటాలిటీస్ గురించి బాగా స్టడీచేయగలిగిన ఆమె ఒకరితో చనువుగా ఉంటే మరొకరికి ఇబ్బంది కల్గడం గమనించి తన ప్రవర్తనే మార్చుకుంది. సాధ్యమైనంత మేరకు అందరితోనూ చనువుగా ఉండటానికే అలవాటు పడింది.

స్టాఫ్‌లో ఒకరు టీ త్రాగడానికి పిలిస్తే మరొకరు కేంటీన్‌లో లంచ్‌కీ, మరొకరు కూల్ డ్రింక్‌కీ ఆఫరు చేసేవారు.

వాళ్ళు చేసే ప్రతిచర్యలోనూ ఏదో తెలియని, కోరిక దాగి ఉండేది. ఆ ఉద్దేశ్యంతోనే ఆమెకు

దగ్గర కావాలని ఆరాటపడుతుండేవారు. అందులో భాగంగానే ఆమేమీ ఆశించకపోయినా ప్రెజెంటేషన్ల రూపంలో ఏవేవో ఇస్తూండేవారు. తమ ప్రేమాభిమానాల్ని చాటాలనే ఉద్దేశ్యంతో పదే పదే ఆమె బర్త్‌డే పార్టీలగురించి ప్రస్తావించి విసిగించేవారు. తనెక్కడున్నా తప్పకుండా పిలుస్తానంటూ తప్పించుకునేది తప్ప మ్వారు మాట్లాడేది కాదు!

ఇలా ఎవరి అభీష్టాన్నీ కాదనకుండా అందరితోనూ సరదాగా ఉండే స్వప్నను చూసి తనను ప్రేమిస్తుందంటే తననే ప్రేమిస్తుందని ఎంతో సంబర పడిపోయేవారు.

బాస్‌కూడా అవసరం ఉన్నా లేకున్నా ఛాంబర్‌కి పిలిచి అసందర్భ విషయాలు ప్రస్తావించి, పైశాచికానందాన్ని పొందేవాడు.

ఒక్కోసారైతే ఆఫీసుటైం తర్వాతకూడా అర్జంటు పనుందంటూ ఉంచేవాడు. తీరాచూస్తే అదేమంత పని ఉండేదికాదు. టోటల్‌గా చెప్పాలంటే వాళ్ళంతా ఆమెను సాటి కొలీగ్‌లా కాకుండా అంగడి బొమ్మలా చూసేవాళ్ళని చెప్పవచ్చు.

స్టాఫ్ ప్రవర్తన పట్ల ఎంతసహ్యం కల్గినా ఎప్పటికప్పుడు అడ్జస్టయిపోతూ ఉండేది స్వప్న. చంచల స్వభావుల మీద కంప్లయింట్ ఎందుకని సర్దుకుపోతూ ఉండేది.

ఇలా తమాషాగా సాగిపోతున్న కాలగమనంలో... ఉన్నట్టుండి ఓ రోజు స్వప్నకు రిజిష్టర్ కవరొకటొచ్చింది. కవరు చించిన తర్వాత ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఎంతోకాలంగా ఎదురు చూస్తోన్న రిజల్ట్ వచ్చింది.

ఆ మర్నాడు అర్జంటుగా ఇంటికి వెళ్ళాలంటూ వారం రోజులు సెలవు పెట్టుకొని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన మర్నాటి రోజునుండే రోజులు లెక్కబెడుతున్నారు స్టాఫంతా. ఎప్పట్నుంచో తమ గుండెల్లో గూడుకట్టుకుని ఉన్న కోర్కెలను నెమరువేసుకోవడం మొదలెట్టారు. స్వప్న సెలవుల నుండి వచ్చిన వెంటనే తమ తమ కోర్కెలను వెల్లడించాలని మనసులోనే రిహార్సల్స్ వేసుకుంటూ, ఆమెరాకకోసం ఎంతో ఉద్విగ్నతతో ఎదురు చూస్తున్నారు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. రఘురాం మనసేమీ బాగాలేక అదేపనిగా సిగరెట్లు గుప్పేస్తున్నాడు. బాస్‌కూడా అదోలా ఉన్నాడు. ఏదో గుర్తొచ్చినట్లుగా స్వప్న టేబుల్‌దగ్గరకు వెళ్తాడు. మళ్ళీ వెనక్కి తిరిగొస్తాడు. ఎవరికీ ఏమీ తోచడంలేదు. స్వప్న ఆఫీసుకి రావల్సిన టైం దగ్గర పడింది. అయినా ఆమె జాడకానరాకపోయేసరికి సందిగ్ధంలో పడ్డారు స్టాఫంతా.

"రిజిష్టర్ పోస్టు సార్!" అంటూ కవరిచ్చాడు పోస్టుమెన్- మేనేజర్‌గారికి.

సంతకం పెట్టి కవరు తీసుకొని చించి చూసేసరికి స్వప్న రిజిగ్నేషన్ లెటర్ కనిపించింది అందులో అనివార్యకారణాలవల్ల తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నానని వ్రాసి ఉంది. అలాగే మరో పేపరులో తన బర్త్‌డే పార్టీకి స్టాఫందర్నీ ఆహ్వానించింది.

స్వప్న రిజిగ్నేషన్ విషయం తెల్సిన తర్వాత, స్టాఫంతా ఒక్కసారే అవాక్కయిపోయారు. ఓ క్షణం పాటు మెదడు మొద్దుబారి పోయింది.

అందరి మొహాల్లోనూ నీరసం తొంగి చూసింది. గుడ్డిలో మెల్లగా ఆమె తమని మర్చిపోకుండా తన బర్త్‌డేపార్టీకి ఆహ్వానించినందుకు ఎంతో ఆనందించారు. బర్త్‌డే పార్టీకి వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు స్టాఫంతా.

అనుకున్న ప్రకారం స్వప్న బర్త్‌డే పార్టీ రోజు దగ్గరకు రానేవచ్చింది. ఆవేళ ఉదయాన్నే స్టాఫంతా ప్రెజెంటేషన్లు తీసుకొని లెటర్లో వ్రాసిన ప్రకారంగా టౌన్ హాల్‌కి చేరుకున్నారు. టౌన్ హాల్ ఆవరణంతా రంగు రంగులకాగితాలతో ఎంతో అందంగా డెకొరేట్ చేయబడి ఉంది.

జిల్లా పోలీస్ యంత్రాంగమంతా అక్కడే కొలువు తీరినట్లుగా ఉంది. తామెప్పుడూ చూడని కొత్తమొహాలెన్నెన్నో దర్శనమిస్తున్నాయి.

'కుమారి స్వప్న ఐ.ఏ.ఎస్ గారికి అభినందన సభ' అనిరాసి ఉన్న బోర్డు చూసిన స్టాఫ్ ఖంగుతిని... తామొచ్చింది కరెక్ట్ అడ్రసుకేనా అని సందేహం వచ్చి మరోసారి స్వప్న రాసిన అడ్రసును చెక్ చేసుకున్నారు.

అంతలో...

నాలుగైదు కార్లొచ్చి అవరణలో ఆగాయి. ఓ కార్లో నుండి స్వప్న దిగింది. హైహీల్స్ తొడుక్కొని గాగుల్స్ పెట్టుకొని, తళ తళామెరిసిపోయే పట్టు చీర ధరించి, ఎంతో హుందాగా చకచక నడుచుకుంటూ స్టేజీ మీదకు వెళ్ళిపోయింది.

నగర అధికార ప్రముఖు లంతా ఆమెను పూలమాలలతోనూ, పొగడ్తలతోనూ ముంచెత్తారు. అప్పట్లో తమతోపాటు పన్జేసిన స్వప్నకూ, తామిప్పుడు చూస్తున్న స్వప్నకూ ఎంతో వ్యత్యాసాన్ని గమనించారు. పైగా తాము ఆమె ఎడల ప్రవర్తించిన తీరుకు తమపై ప్రతీకారమెక్కడ తీర్చుకుంటుందే మోనన్న ఆలోచనల్తో ఎంతో గాబరా చెందారు.

స్టాఫ్ రాకను గమనించిన స్వప్న; స్టాఫ్‌ని సాదరంగా ఆహ్వానించింది. తనను అభినందించడానికి వచ్చిన అధికార అనధికార సమూహాన్ని ఉద్దేశించి...

"మీ అందరి మధ్య ఇంతటి ఆనందాన్ని పంచుకునే భాగ్యం లభించినందుకు నాకీరోజెంతగానో ఆనందంగా ఉంది. ఈ శుభసందర్భంలో జిల్లా అభివృద్ధి కోసం, పేదవారి అభ్యున్నతి కోసం నా శాయశక్తులా కృషి సలుపుతానని హామీ ఇస్తున్నాను."హామీ ఇచ్చింది. పెద్ద పెట్టున హర్షధ్వానాలతో హాలంతా మార్మోగిపోయింది.

మళ్ళీ తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ... తనతో పనిచేసిన మా స్టాఫ్‌ని ఉద్దేశించి...

"మరో ముఖ్య విషయం మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేయాలనే నేను సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి సెలక్టయ్యానని చెప్పలేదు. ఉద్యోగం వచ్చేదాక ఖాళీగా ఉండడమెందుకని ఓ ఆర్నెల్లు మీ ఆఫీస్‌లో పనిచేశాను. నన్ను నన్నుగా కాకుండా ఎక్కడ నన్ను స్పెషల్‌గా ట్రీట్ చేస్తారో నని ఇన్నాళ్ళూ మీకా విషయం చెప్పలేదు. సారీ. మీరంతా నా కోరికను మన్నించి ఈ ఫంక్షన్‌కి రావడం నాకెంతో ఆనందంగా ఉంది. అలాగే మీరు నాపట్ల చూపిన ఆదరాభిమానాలకు మరోసారి కృతజ్ఞు రాల్ని." అంటూ ఉపన్యాసం ముగించింది స్వప్న. ఆ మాటలకి వాడిపోయిన స్టాఫ్ మొహాల్లో ఒక్కసారిగానే ఆనందం వెల్లివిరిసింది.

గతంలో తాము ప్రవర్తించిన ధోరణికి తమ ఎడల ప్రతీకారం తీర్చుకుంటుందేమోనన్న అందోళనతో ఉక్కిరిబిక్కిరౌతున్న మా వాళ్ళకు, ఆమె మాటలుఎంతగానో ఊరటను కల్గించాయి. మరోమారు స్వప్న తన మంచి తనంతో తమపై విజయాన్ని సాధించినందుకు ఎంతో సంతోషించి, తేలికపడ్డ మనస్సులతో వెనుదిరిగారు.

☆